క్లుప్తంగా

రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాల బ్యాగులు అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు, ఎంపీటీసీ దేముడుబాబు

కె.కోటపాడు: రైతాంగానికి మేలు చేసేందుకు సీఎం జగన్ అనునిత్యం తపిస్తున్నారని సర్పంచ్ బండారు దేముళ్లు అన్నారు. గుల్లేపల్లి ఆర్బీకేలో రైతులకు వేరుశనగ విత్తనాలను రాయితీపై ఎంపీటీసీ కొరెడ్డి దేముడుబాబుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణాధికారి లైలాదేవి మాట్లాడుతూ 30 కిలోల వేరుశనగ విత్తనాల బ్యాగు 50 శాతం రాయితీపై రూ.1,820కు అందిస్తున్నట్లు తెలిపారు. గుల్లేపల్లిలో వంద బస్తాల విత్తనాలను పంపిణీ చేశామన్నారు. మెట్ట భూములు వేరుశనగ సాగుకు అనుకూలంగా ఉంటాయన్నారు.

25న అన్నసమారాధన

మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయం వద్ద ఈ నెల 25న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు గౌరీ పరమేశ్వర భజన సేన సంఘం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో కార్తీక సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా, తుఫాన్ వర్షాల వల్ల పై తేదీకి వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు.

విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సురేష్

నాతవరం: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థినులకు అల్లాడ జగన్నాథరావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎ.సురేష్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలో పేద విద్యార్థుల చదువుకు కావాల్సిన సామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థినులు ప్రణాళికతో చదువుకోని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ మేట్రిన్ సిద్దాబత్తుల నూకరత్నం, సంస్థ నిర్వాహకులు పూడి చక్రవర్తి, మంగళ భాస్కర్, బల్ల అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



గర్భిణులకు కిట్లు అందజేస్తున్న సీడీపీవో మేరీసువార్త

మాకవరపాలెం: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మె చేస్తున్న నేపథ్యంలో సకాలంలో పౌష్టికాహారం అందాలని ప్రభుత్వం ఆదేశాల్చింది. ఈ మేరకు శుక్రవారం కొండల అగ్రహారంలో సచివాలయ సిబ్బందితో కలిసి నర్సీపట్నం సీడీపీవో మేరీ సువార్త వీటిని పంపిణీ చేశారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాతవరం: ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హనుమంతురావు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

'కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

నర్సీపట్నం: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 26 నుంచి సమ్మెలోకి వెళ్తున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పేర్కొన్నారు. మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘంతోపాటు సీఐటీయూ నాయకులు శుక్రవారం కమిషనర్ పూడి రవిబాబుకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ సానుకూలంగా పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు బొర్రా శ్రీనువాసరావు, ఆనంద్ పాల్గొన్నారు.



ఫలించిన ఏళ్లనాటి కల

మాడుగులలో త్వరలో ప్రారంభం

రూ.1.40 కోట్లతో పీఆర్ అతిథి గృహ నిర్మాణం



మాడుగుల పట్టణంలో శిథిలావస్థలో అతిథి గృహం



మాడుగుల పట్టణంలో ప్రారంభానికి సిద్ధమైన పీఆర్ అతిథి గృహం

అతిథి దేవోభవ

ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఒకప్పుడు ఆర్అండ్‌బీ అతిథి గృహం(గెస్ట్ హౌస్) ఉండేది. దాన్ని ఇష్టపడని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఎంతలా అంటే అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో కాసేపు విశ్రమిస్తే కాలమే తెలిసేది కాదు. ఇది బ్రిటీష్ కాలం నాటిది. తాచేరు నది పక్కన నిర్మించారు. దీని చుట్టూ ఆవరణలో అందమైన చెట్లు, వాటి నీడ వల్ల ఎండా కాలంలోనూ చల్లని వాతావరణం ఉండేది. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు సైతం ఇక్కడ సేద తీరేవారు. బ్రిటీష్ పాలన అంతమయ్యాక ఇది శిథిలమైపోయింది. ఇప్పుడు దాన్ని ప్రతిబింబించేలా నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. అధునాతన హంగులతో సకల సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చింది.

మాడుగుల: బ్రిటీష్ వారు నిర్మించిన గెస్ట్ హౌస్ శిథిలం కావడంతో దాని పక్కన చిన్న వసతి గృహం 25 ఏళ్ల క్రితం నిర్మించారు. కాలక్రమేణా ఈ గృహాన్ని పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో పూర్తిగా శిథిలమైపోయింది. దీనికి ప్రత్యామ్నాయ వసతి గృహం లేకపోవడంతో కార్యకర్తల సమావేశాలతోపాటు ఇతర అధికార కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బంది ఉండేది. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతోపాటు మహిళా అధికారులు మాడుగుల సందర్శన సమయంలో ప్రైవేటు వసతి గృహాల్లో ఉండాల్సి వచ్చేది. అక్కడ సరైన రక్షణ లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. దాంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే అధికారులు ఇక్కడ బస చేయడానికి ఇష్టపడేవారు కాదు.

అధునాతనంగా నిర్మాణం..

ఈ ప్రాంతంలో ఇబ్బందులను గుర్తించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తాచేరు నది పక్కన వసతి గృహం నిర్మాణానికి రూ.1.40 కోట్లు మంజూరు చేయించారు. ఇక్కడ ఆరు మాసాల్లోనే సర్వాంగ సుందరంగా భవనాన్ని నిర్మించారు. అన్ని వసతులతోపాటు బెడ్ రూమ్‌లు, విశాలమైన హాలు, తాగునీటి వసతి, సభలు, సమావేశాలకు ప్రత్యేకమైన గదులు ఏర్పాటు చేశారు. రక్షణ కోసం ప్రహరీ నిర్మించారు. ఈ భవనాన్ని త్వరలో డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నారని అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

- నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు
- నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మండలంలో పెదగొలుగొండపేట, నాతవరం, శృంగవరం గ్రామాల్లో శుక్రవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను 98 శాతం నెరవేర్చామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజలు హృదయాల్లో నిలిచారన్నారు. ప్రభుత్వం నర్సీపట్నం నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పనులకు రూ.2 వేల కోట్లు వెచ్చించిందన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించే బాధ్యత నాయకులు, వలంటీర్లపై ఉందన్నారు. ప్రధానంగా సచివాలయ, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలు శత శాతం పూర్తి చేసి పండగలోపు ప్రారంభించాలన్నారు. కొన్ని గ్రామాల్లో గడప గడపకు నిధులతో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారాలు చేసి లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని ఎక్కడికక్కడే తిప్పికొట్టాలలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ, నర్సీపట్నంలో రోడ్డు విస్తరణ, గొలుగొండ మండలంలో ఆరిలోవ రోడ్డు, నాతవరం మండలంలో తాండవ ఏలేరు అనుసంధానం చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నర్సీపట్నంలో త్వరలో సామాజిక బస్సు యాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా భూముల రీసర్వే



దిబ్బిడిలో రైతులకు పాసు పుస్తకాలను అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: రైతులకు పైసా ఖర్చు లేకుండా వారి భూములకు సమగ్ర రీసర్వే చేయడం చరిత్రాత్మకమని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. దిబ్బిడి గ్రామంలో 650 మంది రైతులకు శుక్రవారం ఆయన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఇటీవల భూములు సర్వే చేసి హద్దు రాళ్లు పాతి తాజాగా శాశ్వత భూ హక్కు పత్రాలు, పాసు పుస్తకాలు అందజేశారు. ఎటువంటి భూ వివాదం తలెత్తకుండా సర్వే చేసిన వీఆర్వో ఎర్రయ్య, సర్వేయర్ గణేష్‌లను గ్రామ రైతులు సత్కరించారు. వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయమూర్తి, గొంపా చినబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, నాయకులు చేబోలు భూషణం పాల్గొన్నారు.

పాడి పోషణతో ఆర్థికాభివృద్ధి



మహిళా రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో జయమాధవి

నర్సీపట్నం: పాడి పోషణతో మహిళలు ఆర్థికంగా రాణించవచ్చునని ఎంపీడీవో జయమాధవి పేర్కొన్నారు. మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన మహిళా పాడి రైతులకు జగనన్న పాలవెల్లువ ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా ప్రభుత్వం మహిళా పాడి రైతులకు రూ.1.60 లక్షల రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. దీంతో రూ.56 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ రుణాల ద్వారా పాడి గేదెలు, ఆవులను కొనుగోలు చేసుకుని వాటి పాలతో సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. పాడి పోషణకు సంబంధించి పలు అంశాలను వెటర్నరీ డాక్టర్ హరిప్రియ, ప్రియాంక వివరించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం పార్వతి, మండల సమైక్య కోశాధికారి పి.రామలక్ష్మి, ఏపీజీవీబీ మేనేజర్ సిహెచ్.ఎస్.బి.భవాని, రాజశేఖర్, రామలక్ష్మి , ధర్మసాగరం, దుగ్గాడ, శ్రీరామ్, వేములపూడి మహిళలు పాల్గొన్నారు.

తారువలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు

భారీ కేక్ కట్ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ప్రత్యేక ఆకర్షణగా మహిళల కోలాట ప్రదర్శన

దేవరాపల్లి: తారువ క్యాంప్ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం అర్ధరాత్రి వరకు జరిగాయి. గ్రామస్తులతోపాటు మండల వ్యాప్తంగా హాజరైన పార్టీ శ్రేణుల నడుమ మహిళల కోలాట ప్రదర్శనలు, తీన్మార్ వాయిద్యాలు, డీజే సౌండ్స్, బాణసంచా కాల్పులతో పండుగ మాదిరిగా జరుపుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కేక్ కట్ చేసి పార్టీ మహిళా నేతలకు తినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రూకుల అప్పారావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వి.లలితానాయుడు, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



దేవరాపల్లిలో ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ సత్యం, బాబూరావు



విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ అచ్చిబాబు

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పేద విద్యార్థులకు అందించడం చరిత్రాత్మకమని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వారు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావుతో కలిసి శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఎంఈవోలు బి. పడాల్‌దాస్, వి. ఉషారాణి, ఎడ్ల బంగారయ్య, కొరుపోలు శ్రీను పాల్గొన్నారు.

చీడికాడ: సాంకేతిక విద్యా విప్లవం దిశగా జగనన్న పాలన సాగుతోందని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం దండిసురవరం ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో 8వ తరగతికి చెందిన 21 మంది విద్యార్థులకు బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను సర్పంచ్ కోన అర్జునతో కలిసి ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నందారపు రమణబాబు, వైఎస్సార్‌సీపీ నేత రామకృష్ణ పాల్గొన్నారు.

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుల్లో మరింతగా రాణించాలనే లక్ష్యంతో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందిస్తున్నట్లు ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు అన్నారు. శుక్రవారం కొరువాడ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కమలాకుమారి, పీడీ దేముళ్లు పాల్గొన్నారు.

నూకినాయుడు ఆశయ సాధనకు కృషి

గొలుగొండ: పేదల కోసం పనిచేసి వారి హక్కులు కాపాడిన సీపీఐ నేత లగుడు నూకినాయుడు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అల్లూరి జిల్లా కొయ్యూరు జెడ్పీటీసీ వి. నూకరాజు తెలిపారు. నూకినాయుడు 25 వర్ధంతి సందర్భంగా గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు.

దేవరాపల్లి పీహెచ్‌సీ -2 వైద్యాధికారిగా వనజ



డాక్టరు వనజ

దేవరాపల్లి: స్థానిక పీహెచ్‌సీ -2 వైద్యాధికారిగా డి. వనజ శుక్రవారం విధుల్లో చేరారు. ఈమె విశాఖపట్నంలోని టెలీ మెడిషన్ విభాగంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలితను తుని బదిలీ చేయడంతో ఆమె స్థానంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నియమించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తన వంతుగా కృషి చేస్తానని నూతన వైద్యాధికారి తెలిపారు.

137 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రవితేజ

కె.కోటపాడు: శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రవితేజ తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చంద్రయ్యపేటలో 137 మందికి ఓ.పి ద్వారా వైద్య సేవలందించారు. నాలుగు ఇళ్లకు వెళ్లి అచేతన రోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నం: స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీసీపీఎస్ఈఏ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాడి సూర్యప్రకాష్, త్రినాథస్వామి కేక్ కట్ చేసి సహచర యూనియన్ ఉపాధ్యాయులకు పంచారు. రాష్ట్ర కౌన్సిలర్ చుక్కా రాము, యూనియన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణితం లేని జీవితం ఊహించలేం

గణిత దినోత్సవంలో ఎంఈవోలు



మాకవరపాలెం: జి.వెంకటాపురంలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవోలు మూర్తి, జాన్‌ప్రసాద్



రోలుగుంట: రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు



రోలుగుంట: కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సహదేవుడు

మాకవరపాలెం: గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. జి.వెంకటాపురం, జి.కోడూరు పాఠశాలల్లో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంఈవోలు మూర్తి, జాన్ ప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జీవితంలో గణితం ఒక భాగమని, గణితం లేని జీవితం ఊహించలేదన్నారు. తూటిపాల ప్రాథమికోన్నత, స్థానిక కేజీబీవీతోపాటు పలు పాఠశాలల్లో విద్యార్థులతో గణిత మేళా నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక హెచ్ఎం, ఎంఈవో-1 బి. పడాల్దాస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారీ చేసిన గణిత ప్రాజెక్టు నమూనాలను పరిశీలించి అభినందించారు. అదేవిధంగా కాశీపురం హైస్కూల్‌లో హెచ్ఎం పి.బి.టి. సుందరి ఆధ్వర్యంలో గణిత పితామహుడు రామానుజాన్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.కృష్ణ, గణిత అధ్యాపకుడు గిరిజాశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రంలో రామానుజన్ చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. నిత్య జీవితంలోనూ, పోటీ పరీక్షల కోసం, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్‌లోనూ గణితశాస్త్రం ప్రాముఖ్యతను గణిత అధ్యాపకులు విశదీకరించారు.

కె.కోటపాడు: గణితంలో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని గణిత ఉపాధ్యాయుడు జె.అమృతరావు అన్నారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గణిత క్విజ్, రామానుజమ్‌పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు రామశేషు, రమాకుమారి, సతీష్‌లను ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు శర్మ, శ్రీరామ్మూరి ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలు జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సహదేవుడు, బీబీపట్నంలో హెచ్ఎం ఎన్. అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



రోలుగుంటలో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న అర్చక కుటుంబీకులు



చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూల తోరణాలతో ముస్తాబు చేస్తున్న కమిటీ సభ్యులు

మాడుగుల/రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు శుక్రవారం తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. మాడుగుల అతి పురాతన వేంకటేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రధాన అర్చకుడు ఆరవిల్లి రఘునాదాచారి తెలిపారు. ఈ రెండు చోట్ల అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు.

రోలుగుంట: స్థానిక కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ మేరకు ఆయన తన కుటుంబీకులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఆలయాన్ని శుద్ధి చేశారు. ఆలయ ఆవరణలో షామియానాలు వంటి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

చోడవరం: వైష్ణవాలయాలన్నీ ముక్కోటి ఏకాదశి పర్వదినం ప్రత్యేక పూజలకు ముస్తాబయ్యాయి. చోడవరంలో ప్రసిద్ధిగాంచిన కేశవస్వామి, గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విష్ణుమూర్తి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమన్నారాయణ స్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు, తిరువీధు రథాలు, పల్లకీలు అన్నీ సిద్ధం చేశారు.

దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారం దత్తపీఠంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 20న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 26వ తేదీతో ముగిస్తాయని దత్త పీఠాధిపతి శ్రీనివాస భరణీశర్మ శుక్రవారం తెలిపారు. ముగింపు రోజున మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తామన్నారు.

మాడుగులలో తిరువీధోత్సవాలు



పార్థసారథి స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

మాడుగుల: అతి పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం మాడుగులలో తిరువీధోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.